
చీరాల నవాబుపేట ఈద్గాలో బక్రీద్ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు


బక్రీద్ నమాజులో ముస్లింలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండయ్య


మార్టూరులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

త్యాగానికి.. సత్యానికి ప్రతీక బక్రీద్

- భక్తిశ్రద్ధలతో బక్రీద్ పండుగ
- ప్రత్యేక నమాజులో పాల్గొన్న ముస్లింలు

చీరాల టౌన్: త్యాగానికి, సత్యానికి, సమైక్యతకు ప్రతీక అని మాజావర్లు పేర్కొన్నారు. ముస్లింల రెండో అతిపెద్ద పండుగ బక్రీద్‌ను సోమవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. చీరాల నవాబుపేట ఈద్గా వద్ద ప్రత్యేక నమాజు కార్యక్రమాన్ని మత పెద్దలు నిర్వహించారు. ఈసందర్భంగా మతపెద్ద తన సందేశంతో అత్యంత ప్రీతి పాత్రమైన దానిని దైవం కోసం త్యజించడం, దైవ మార్గంలో బక్రీద్‌ను ప్రబోధించడమే నీతి సూత్రం అని పేర్కొన్నారు. బక్రీద్ పండుగ సందర్భంగా హిందు, ముస్లింలు 'బక్రీద్ ముబారక్' అంటూ ఆలింగనం చేసుకున్నారు. విశ్వాసానికి, త్యాగాలకు ప్రతీకగా బక్రీద్ పర్వదినాన్ని జరుపుకుంటున్నామని, ధనవంతులు తమ శక్తిమేర పేదలకు సహాయపడి, ఆకలితో ఉన్న వారికి అన్నం పెట్టడం ఆనవాయితీగా వస్తుందన్నారు. మహమ్మద్ ప్రవక్త సూక్తులను వినిపించారు. ప్రత్యేక నమాజు కార్యక్రమానికి హాజరైన చీరాల ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య యాదవ్ ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేసి ఈద్గాలో ప్రత్యేక నమాజులో పాల్గొని మాట్లాడారు. అనంతరం ముస్లింలు ఖబరస్తాన్ వద్దకు వెళ్లి పితృదేవతలను స్మరించుకున్నారు. ముస్లిం కుటుంబం ఖుర్బాని నిర్వహించారు. మసీదులను సర్వాంగ సుందరంగా అలంకరించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈప్రార్థనలో మత పెద్దలు, చీరాల, పేరాల ముస్లింలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

త్యాగనిరతికి ప్రతీక బక్రీద్..

యద్దనపూడి/చినగంజాం/మార్టూరు/కారంచేడు: త్యాగనిరతికి ప్రతీకైన బక్రీద్‌ను మండలంలోని ముస్లింలు సోమవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. వేకువజామునే స్నానమాచరించి, కొత్తదుస్తులు ధరించి ఈద్గాలు, మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మతపెద్దలు బక్రీద్ విశిష్టతను వారికి వివరించారు. అనంతరం ఒకరికొకరు ఈద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పేదలకు ఖుర్బానీ ఇచ్చారు.

■ కారంచేడు, కుంకలమర్రు, దగ్గుబాడు, ఆదిపూడి, స్వర్ణ, కొడవలివారిపాలెం, గ్రామాల్లో ముస్లింలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మత బోధకులు ఇస్లాం బోధనలు, అల్లాహ్ ప్రవచనాలను వారికి వివరించారు. అనంతరం ఒకరికొకరు ఆలింగనం చేసుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. వారి ఆర్థిక స్తోమతను బట్టి పేదలకు ఆహారం, పండ్లు, వస్త్రాలు బహూకరించారు.

■ చినగంజాంలోని ఇస్లాంపేట మసీదు పేటకు చెందిన ముస్లింలు అల్లాహ్ స్మరిస్తూ ఈద్గా వద్దకు నడిచి వెళ్లారు. అనంతరం మత పెద్దలు వారికి అల్లా బోధనలను వివరించారు. అనంతరం ముస్లింలు దానధర్మాలు చేశారు. కార్యక్రమంలో మసీదు పెద్దలతో పాటు ముస్లిం పెద్దలు పాల్గొన్నారు. ముస్లింలంతా బక్రీద్ పండుగను పురస్కరించుకుని అందరూ కొత్త బట్టలు ధరించి ఎంతో ఉత్సాహంగా ఈకార్యక్రమాల్లో పాల్గొన్నారు.


పర్చూరులో ఖురాన్‌ను బోధిస్తున్న మత పెద్ద

■ బక్రీద్ పండుగ త్యాగానికి, దానగుణానికి ప్రతీకని పర్చూరు మసీదు పేష్ ఇమామ్ షేక్ షాహిద్ రజాక్ అన్నారు. బక్రీద్ పండుగను పురస్కరించుకొని పర్చూరు, ఉప్పుటూరు, నూతలపాడు, నాగులపాలెం, చెరుకూరు, వీరన్నపాలెం, తదితర గ్రామాల్లో ముస్లింలు ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో మసీదు ప్రెసిడెంట్ ఆహ్మద్‌బాషా, ముతవల్లి నబీ, మతపెద్దలు షేక్ ఖాజావలి, షేక్ ఖాలేషా, షేక్ మాబూసుభాని, ఫక్రుద్దీన్ ఆలీ తదితరులు పాల్గొన్నారు.

మనుషులంతా ద్వేషాన్ని వీడాలి..

మేదరమెట్ల/పంగులూరు/బల్లికురవ: ముస్లింలు ఎంతో భక్తిశ్రద్ధలతో నిర్వహించే బక్రీద్ పండుగను సోమవారం కొరిశపాడు మండలంలోని ముస్లింలు పండుగను నిర్వహించారు. పెద్దలను తలచుకొంటూ పేదలకు దాన ధర్మాలు చేయడంతో పాటు అద్దంకి రోడ్డులో గల ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరినొకరు బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

■ బల్లికురవ మండలంలోని వల్లాపల్లి, కొప్పరపాడు, వైదన, కొమ్మానేనివారిపాలెం, ముక్తేశ్వరం, చెన్నుపల్లి, బల్లికురవ, గుంటుపల్లి, అంబడిపూడి, కొణిదెన, ఉప్పుమాగులూరు, కోటావారిపాలెం గ్రామాల్లో ముస్లింలు బక్రీద్ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.


వల్లాపల్లి ఈద్గా వద్ద మాట్లాడుతున్న ముజావర్లు


దగ్గుబాడు ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు


పంగులూరులో ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

క్లుప్తంగా

బైకిస్టుకు గాయాలు

మేదరమెట్ల: మోటారు బైకు అదుపు తప్పి బోల్తా పడిన ఘటనలో బైకిస్టుకు గాయాలు అయిన ఘటన కొరిశపాడు మండలంలోని తిమ్మనపాలెం గ్రామ సమీపంలో సోమవారం చోటు చేసుకుంది. అందిన వివరాల మేరకు.. దైవాలరావూరు గ్రామానికి చెందిన ఎస్.శ్రీనివాసరావు స్వగ్రామం నుంచి ఒంగోలుకు మోటార్ బైకుపై వెళ్తున్నాడు. బైకు తిమ్మనపాలెం వద్దకు రాగానే అదుపు తప్పిన బైకు బోల్తా పడింది. దీంతో శ్రీనివాసరావుకు రక్తగాయాలు కాగా 108 వాహనంలో ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు.

స్వర్ణమ్మతల్లికి ఆడపడుచుల పసుపు, కుంకుమ


ప్రత్యేక అలంకరణలో స్వర్ణమ్మతల్లి

స్వర్ణ (కారంచేడు): గ్రామ దేవతగా విరాజిల్లుతున్న స్వర్ణమ్మతల్లికి గ్రామ ఆడపడుచులు పెద్ద ఎత్తున పసుపు, కుంకుమలు సమర్పించి మొక్కుబడులు తీర్చుకున్నారు. గ్రామ దేవత స్వర్ణమ్మ తల్లి 31వ తిరునాళ్లను పురస్కరించుకొని సోమవారం ఉదయం నుంచి భక్తులు పెద్దఎత్తున ప్రత్యేక పూజలు నిర్వహించారు. తిరునాళ్ల ప్రారంభం రోజున గ్రామంలోని ఆడపడుచులు ఎక్కడెక్కడ నివాసముంటున్నప్పటికీ గ్రామానికి వచ్చి తమ కోరికలు తీర్చే స్వర్ణమ్మకు పసుపు, కుంకుమలు సమర్పించడం ఆనవాయితీ. భక్తి, శ్రద్ధలతో నిర్వహించే కార్యక్రమాన్ని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులతో పాటు, దేవాదాయశాఖ మండల మేనేజర్‌ల ఆధ్వర్యంలో పవిత్రంగా జరిపిస్తారు. మంగళవారం అమ్మవారి ఘటముల కుండలను మాతంగి తప్పెట్లతో గ్రామోత్సవం నిర్వహించి తిరునాళ్లను నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. తిరునాళ్ల సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



జే.పంగులూరు: ముందు వెళ్తున్న ట్రాక్టర్‌ను బైకు ఢీకొట్టడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈఘటన సోమవారం రాత్రి 10.30 గంటల సమయంలో రేణింగవరం జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. అందిన వివరాల మేరకు.. కొండమూరు గ్రామానికి చెందిన షేక్ దరియావలి (25) బేల్దారి పనులు చేస్తుంటాడు. ఈక్రమంలో దరియావలి పనిముగించుకుని గ్రామానికి బయలుదేరాడు. సరిగా అదే గ్రామానికి చెంది ట్రాక్టర్ ముందు వెళ్తోంది. ఇది గమనించక దరియావలి బైక్‌తో ఢీకొట్టాడు. తీవ్రగాయాలైన దరియావలిని స్థానికులు 108లో అద్దంకికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా మల్లేశ్వరస్వామి వార్షికోత్సవం


అలంకరణలో మల్లేశ్వరస్వామి


అలంకరణలో పార్వతి అమ్మవారు


వేడుకల్లో పాల్గొన్న భక్తులు

బల్లికురవ: మండలంలోని చిన అంబడిపూడి గ్రామంలోని గంగాపార్వతీ సమేత మల్లేశ్వరస్వామి 8వ వార్షికోత్సవం సోమవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు పేటేటి లక్ష్మీ వరప్రసాదరావుచే గణపతికి అభిషేకం, మల్లేశ్వరస్వామి మహన్యాసపూర్వక ఏకవార రుద్రాభిషేకం, అన్నాభిషేకం, పార్వతి అమ్మవారికి కుంకుమ పూజలు, ఆంజనేయుని తమల పాకులతో అర్చన ప్రత్యేక అలంకరణ చేపట్టారు. శివ పార్వతుల కల్యాణం, కమనీయంగా నిర్వహించారు. వేడుకలో భాగంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్న సంతర్పణ చేపట్టారు. వేడుకల్లో గ్రామంతోపాటు పరిసర గ్రామాల్లోని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయ కమిటి ఆధ్వర్యంలో భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేపట్టారు.

పిల్లలపై తల్లిదండ్రులకు అవగాహన అవసరం


మాట్లాడుతున్న ఎంఈవో సుధాకర్‌రావు

అద్దంకి: ప్రత్యేక అవసరాలు గల పిల్లలపై తల్లిదండ్రులకు అవగాహన అవసరమని మండల విద్యాశాఖ అధికారి బీ సుధాకరరావు అన్నారు. స్థానిక సత్రం బడి పాఠశాలలో సోమవారం నిర్వహించిన 'నేను బడికి పోతా' నాలుగో రోజు కార్యక్రమానికి ఎంఈవో వన్ గంగాధర్, ఎంఈవో టూ బీ సుధాకరరావు ముఖ్య అతిథులుగా హాజరైయ్యారు. ఈ సంర్భంగా సుధాకరరావు మాట్లాడుతూ వైకల్యంతో జన్మించిన పిల్లలకు ప్రభుత్వం ఎంతగానో సాయం అందిస్తుందన్నారు. వారిని సాధారణ పిల్లల వలే బతికే విధంగా తయారు చేసేందుకు ప్రత్యేక విద్య భవిత కేంద్రాలను ఏర్పాటు చేశారని చెప్పారు. వారిని తల్లిదండ్రులు సాధారణ పిల్లతోపాటు చూడాలన్నారు. వ్యత్యాసం చూపితే వారిలో ఆత్మన్యూనతా భావం ఏర్పడుతుందని చెప్పారు. ప్రత్యేకావసరాల పిల్లలకు ప్రభుత్వ సమగ్రశిక్ష ద్వారా అలవెన్స్‌లు అందిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో కేవీ శ్రీనివాసరావు, ఐటీఆర్‌టీ ఉపాధ్యాయులు కంగల శ్రీనివాసు, పాలపర్తి యేనా, గురవయ్య తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్‌కు ఉత్తమ సేవా పురస్కారాలు


సేవా పురస్కారాలు అందుకుంటున్న మార్టూరు క్లబ్ ప్రతినిధులు


పురస్కారాలు అందుకుంటున్న పర్చూరు రోటరీ సభ్యులు

మార్టూరు/చినగంజాం: సామాజిక సేవలో తమ వంతు సేవలు అందిస్తున్న మార్టూరు, పర్చూరు రోటరీ క్లబ్ రాష్ట్రస్థాయి ఉత్తమ సేవా పురస్కారాలను అందుకుంది. తెలంగాణ రాష్ట్రం భద్రాచలంలో ఆదివారం రాత్రి నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్రస్థాయి మూడు అవార్డులు అందుకున్నారు. రోటరీ క్లబ్ 3150 జిల్లాకు సంబంధించి ఆంధ్ర రీజియన్ పరిధిలో మూడో ఉత్తమ రోటరీ క్లబ్ అధ్యక్షుడిగా తాళ్లూరి సాంబశివరావు, ఉత్తమ అసిస్టెంట్ గవర్నర్‌గా ఇంటూరి అంజనేయులు, ఉత్తమ రొటేరియన్‌గా జేవీ మోహన్‌రావు- 3150 రోటరీజిల్లా గవర్నర్ బూసి రెడ్డి శంకర రెడ్డి చేతుల మీదుగా వారు అవార్డులు అందుకున్నారు. పర్చూరు క్లబ్‌ను బెస్ట్ క్లబ్‌గాను , ఉత్తమ కార్యదర్శిగా పంబి సదానందరెడ్డి, వైబ్రంట్ క్లబ్‌గాను గుర్తిస్తూ 10 ప్రశంస పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు నాగబైరు శ్రీనివాసరావు, కాబోయే అధ్యక్షుడు తోకల కృష్ణ మోహన్, రోటరీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా వాడరేవు రోడ్డు


పేరాల వాడరేవు రోడ్డులో నరికివేసిన గుంతలపై వెళ్తున్న వాహనాలు


కోర్టు సెంటర్లోని మూడు రోడ్ల కూడలిలో రోడ్డు పక్కన ఏర్పడిన గొయ్యి

- స్పీడు బ్రేకర్లతో ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు

చీరాల రూరల్: పట్టణంలోని పలు ప్రాంతాల్లో రోడ్లు వాహనదారులను ఇబ్బందులు పెడుతున్నాయి. పట్టణంలోని పేరాల చిన్నరథం సెంటర్ నుంచి కోర్టు మీదుగా కుందేరు వరకు వెళ్లే ఆర్‌అండ్‌బీ (వాడరేవు) రోడ్డు పూర్తిగా ధ్వంసమై అధ్వానంగా తయారయ్యింది. స్థానికంగా ఉన్న నివాసాల వారు ఆరోడ్డును అనేక చోట్ల తమ ఇష్టానుసారంగా నరికివేసి ఆయా ఇళ్లనుంచి వచ్చే మురుగునీటిని ప్రధాన మురుగుకాలువలోకి కలుపుతున్నారు. ఈ తతంగమంతా అక్కడ స్థానికంగా ఉన్న నివాసులకు బాగానే ఉన్నా రోడ్డుపై ప్రయాణించే వాహనదారులకు మాత్రం ప్రాణ సంకటంగా మారింది. 30 అడుగులకు ఒక పొడవాటి గుంత రోడ్డుపై తవ్వి ఉండడంతో ద్విచక్రవాహనదారులు ఆ గుంతలలో పడి గాయాలపాలవుతున్నారు. అంతేకాక ఆ గుంతలను దాటుకుంటూ వాహనాలు వెళ్లే సమయాలలో గుంతల దాటికి వెన్నునొప్పులు కూడా వస్తున్నాయని వాహనదారులు చెబుతున్నారు.

స్పీడు బ్రేకర్లతో ఇక్కట్లు..

కోర్టు భవన సముదాయాలకు సమీపంలో గాంధీ నగర్ మీదుగా ఐటీసీ బంగ్లాకు వెళ్లే దారిలో వెంటవెంటనే రెండుచోట్ల స్పీడు బ్రేకర్లు వేశారు. దీని వలన ద్వి చక్రవాహనదారులు, ఆటో వాలాలు మరింత ఇబ్బందులు పడుతున్నారు. సాధారణంగా స్పీడు బ్రేకర్లు అంటే వాహనాలు వేగంగా వెళ్లకుండా వేగాన్ని నియంత్రించేందుకు ఒక స్పీడు బ్రేకర్ ఏర్పాటు చేస్తారు. రెండుచోట్ల వెంటవెంటనే మూడేసి చొప్పున ఆరు స్పీడు బ్రేకర్లు వేశారు. వాహనాలు స్పీడు బ్రేకర్లు దాటే క్రమంలో చాలా నెమ్మదిగా వెళ్లాల్సి రావడం, వాహనదారులు వాహనాల వేగాన్ని నియంత్రించలేక పడిపోతూ గాయాలపాలవుతున్నారు. జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషాకు ముందు పనిచేసిన జిల్లా మహిళా కలెక్టర్ తన క్యాంపు కార్యాలయాన్ని ఐటీసీ బంగ్లాలో ఏర్పాటు చేయించుకున్నారు. ఆ సమయంలో ఇక్కడ కలెక్టర్ క్యాంపు కార్యాలయం ఉందంటూ సూచిక బోర్డులు ఏర్పాటుచేసి వాహనదారుల వేగాన్ని నియంత్రించేందుకు స్పీడు బ్రేకర్లు వేశారు. అయితే ప్రస్తుతం కలెక్టర్ క్యాంపు కార్యాలయం ఇక్కడ నుంచి తరలించి కలెక్టర్ క్యాంపు కార్యాలయం పేరుతో ఉన్న సూచిక బోర్డులను కూడ అధికారులు తొలగించి చాలా కాలం అయ్యింది. కానీ అప్పుడు వేసిన ప్రమాదకరంగా ఉన్న స్పీడు బ్రేకర్లు మాత్రం తొలగించలేదు. దీంతో వాహనదారులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు.


వాడరేవు రోడ్డులో ప్రమాదకరంగా మారిన స్పీడు బ్రేకర్లు

డయ్యింగ్ యూనిట్లతో ఇబ్బందులు..

కుందేరు కాలువ ఒడ్డు నుంచి కోర్టు ఎదరు వరకు నిర్మించిన సిమెంట్ రోడ్డును కూడా కొందరు డయ్యింగ్ యూనిట్ల యజమానులు తమ యూనిట్లలో నుంచి వ్యర్థమైన నీటిని మురుగు కాలువ ద్వారా కుందేరు కాలువలోకి వదులుతున్నారు. ఆ క్రమంలో ఒకవైపు మురుగు కాలువ లేకపోవడంతో సిమెంట్ రోడ్డును వారి ఇష్టానుసారంగా నరికి మురుగునీటి పైపులను అమర్చుకున్నారు. కానీ గోతులను మాత్రం పూడ్చకుండా వదిలివేశారు. వాహనదారులు ఆ గుంతల్లో పడి గాయాలపాలవుతున్నారు. ఈ రెండు ప్రాంతాల్లోని రోడ్లను స్థానికులు వారి ఇష్టానుసారంగా నరికివేసి వారికి అనుకూలంగా మార్చుకుంటున్నప్పటికి అధికారులు మాత్రం తమకెందుకులే అనే ధోరణిలో మిన్నకుండిపోతున్నారు.

అత్తింటి వేధింపులపై కేసు

మార్టూరు: అత్తింటి వారి వేధింపులపై మార్టూరు పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. ఏఎస్సై ఎం శ్రీనివాసరావు వివరాల మేరకు.. ఇసుక దర్శి గ్రామానికి చెందిన షేక్ కరీంమూన్‌పై ఆమె భర్త హసన్‌వలి, అత్త మస్తాన్‌బీ, ఆడపడుచు నూర్జహాన్‌లు గత నెల 26వ తేదీ దాడి గాయపరిచారు. ఈక్రమంలో సోమవారం కరీంమూన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఇదే గ్రామంలో యువకుడిపైదాడి..

ఇసుక దర్శి గ్రామానికి మరియదాసు అనే యువకుడిని ఇదే గ్రామానికి చెందిన మరో యువకుడికి మధ్య ఘర్షణ జరిగింది. ఇందులో భాగంగా మరియదాసును ఆయువకుడు ఇనుపరాడ్‌తో దాడిచేయగా తలకు తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు మార్టూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం బంధువులు మెరుగైన చికిత్స కోసం చిలకలూరిపేట ప్రైవేటు ఆసుపత్రికి తరలించారని సమాచారం.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

జాతీయ రహదారిపై ఇసుకదర్శి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓయువకుడు గాయపడ్డాడు. అందిన వివరాల మేరకు.. బల్లికురువ మండలం కొమ్మినేనివారిపాలెం గ్రామానికి చెందిన షేక్ బాజీ తన బైక్‌పై మార్టూరు నుంచి ఇసుకదర్శి గ్రామంలో ఉన్న తన తల్లి వద్దకు వెళ్తున్నాడు. ఈక్రమంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ సమీపంలో వాహనం అదుపుతప్పి కిందపడి తీవ్రగాయాలపాలయ్యాడు. సమాచారం అందుకున్న హైవే అంబులెన్స్ సిబ్బంది క్షతగాత్రుడిని చిలకలూరిపేటకు తరలించారు.

విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ

చీరాల అర్బన్: చీరాల రూరల్ మండలం వాడరేవు పంచాయతీలోని సునామి కాలనీలో మార్పు సంస్థ ఆధ్వర్యంలో సోమవారం 100 మంది విద్యార్థులకు ఉచితంగా నోటుపుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మార్పు సేవా సంస్థ ప్రతినిధులు మార్పు గ్రెగోరి మాట్లాడుతూ సంస్థ ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలను గురించి విద్యార్థులకు, యువతకు తెలిపారు. సముద్రతీర ప్రాంతాల్లో విపత్తులు సంభవించినప్పుడు సేవా కార్యక్రమాలను నిర్వహించి నిత్యవసర వస్తువులు పంపిణీ, విద్య, వైద్య కార్యక్రమాలను చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఫాదర్ లాజర్, రిటైర్డు ప్రిన్సిపాల్ మార్పు విన్సెంట్ పాల్, బాపట్ల రెవెన్యూ అసోసియేషన్ అధ్యక్షుడు చేగూడి సురేష్, భాస్కర్, జోతుల ప్రకాష్, దేవరపల్లి జోషి, మార్పు సంస్థ కో-ఆర్డినేటర్ పి.నాగేశ్వరరావు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అందించిన నోటుపుస్తకాలు